epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 101 | గురువారం | 29.08.2024



ఆత్మవిశ్వాసాలకు ప్రతీకగా

# తెలంగాణ తల్లి

## మన కన్నతల్లిలా.. కొత్త రూపం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ

తెలంగాణ దర్పం, పోరాట స్ఫూర్తి ఉట్టిపడేలా, ఆత్మవిశ్వాసం తొణికిసలాడే విధంగా తెలంగాణ తల్లి విగ్రహం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. దొరతనానికి ప్రతీకగా కాకుండా ప్రజలు తమ కన్నతల్లిని చూసుకున్నంత సంతోషకరంగా తెలంగాణ తల్లి రూపం ఉంటుందని స్పష్టం చేశారు. విగ్రహ నమూనా రూపొందించే బాధ్యతను జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ విభాగానికి అప్పగించామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం ప్రధాన ద్వారం ముందు తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు ముఖ్యమంత్రి బుధవారం భూమిపూజ చేశారు.


- మన చౌరాస్తా, హైదరాబాద్ ప్రతినిధి

2లో..

## 31న గద్దర్ వర్ధంతి సభ

- హాజరుకానున్న ప్రముఖ కళాకారులు

3



## సుస్థిర అభివృద్ధి సాధించాలి

- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

3



General News



## ఆత్మవిశ్వాసాలకు ప్రతీకగా

# తెలంగాణ తల్లి విగ్రహం

- మన కన్నతల్లుల్ని చూసుకున్నంత సంతోషకరంగా కొత్త రూపం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ
- డిసెంబర్ 9న వైభవోపేతంగా విగ్రహావిష్కరణ

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ దర్పం, పోరాట స్ఫూర్తి ఉట్టిపడేలా, ఆత్మవిశ్వాసం తొణికిసలాడే విధంగా తెలంగాణ తల్లి విగ్రహం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. దొరతనానికి ప్రతీకగా కాకుండా ప్రజలు తమ కన్నతల్లిని చూసుకున్నంత సంతోషకరంగా తెలంగాణ తల్లి రూపం ఉంటుందని స్పష్టం చేశారు. విగ్రహ నమూనా రూపొందించే బాధ్యతను జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ విభాగానికి అప్పగించామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం ప్రధాన ద్వారం ముందు తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టాపనకు ముఖ్యమంత్రి బుధవారం భూమిపూజ చేశారు. మిలియన్ మార్చ్ తరహాలో లక్షలాది మంది సమక్షంలో డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ వైభవోపేతంగా జరుపుతామని ప్రకటించారు. సంకల్పం, పట్టుదల ఉంటే సాధ్యం కానిది ఏదీ ఉండదని తెలంగాణ ఉద్యమం నిరూపించిందని, ఇచ్చిన మాటకు కట్టుబడి సోనియా గాంధీ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని సీఎం అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయ ఆవరణలోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠాస్తామని దశాబ్ది వేడుకల సందర్భంలోనే తాను ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. సచివాలయం లోపల తెలంగాణ తల్లి, మరోవైపు బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం, దానికి ఎదురుగా పీవీ నర్సింహారావు, అంజయ్య విగ్రహాలు, జైపాల్ రెడ్డి స్మారకం, ఇటు వైపు కాకా వెంకటస్వామి తదితర మహానుభావుల విగ్రహాలు, అమర వీరుల స్మారకచిహ్నం సచివాలయానికి మధ్య దేశం కోసం ప్రాణత్యాగం చేసిన రాజీవ్ గాంధీ విగ్రహం శోభాయమానంగా ఉంటుందని, మేధావుల సూచనల మేరకే ముందుకు వెళుతున్నామని సీఎం పేర్కొన్నారు. గడిచిన పదేండ్లలో తెలంగాణ తల్లిని తెరమరుగు చేసిన గత పాలకులు సచివాలయం ఎదురుగా ఉన్న ప్రాంతంలో తమ విగ్రహం పెట్టుకోడానికి ప్రయత్నించారని, అయితే ప్రజల ఆశీర్వాదంతో అధికారంలో వచ్చిన ప్రజా ప్రభుత్వం ఆ ప్రయత్నాలను అడ్డుకొని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ తల్లిని సచివాలయంలో ప్రతిష్ఠిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ అవకాశం దక్కడం తన అదృష్టమన్నారు. బుధవారం తప్పితే దసరా వరకు మంచి రోజులు లేవని వేద పండితులు చెప్పడంతో హుటాహుటిన భూమిపూజ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేరళ వెళ్లడం, మిగతా మంత్రులు ముందే నిర్దేశించిన కార్యక్రమాల్లో ఉండటం వల్ల హాజరుకాలేక పోయారని సీఎం తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సలహాదారులు, ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## బషీర్ బాగ్ అమరుల త్యాగఫలితమే ఉచిత విద్యుత్

**జనగామ, మన చౌరాస్తా :** 2000 సంవత్సరంలో విద్యుత్ ప్రవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఎం నిర్వహించిన పోరాటంలో బషీర్‌బాగ్‌లో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్ బాలస్వాములకు సీపీఎం జనగామ జిల్లా కార్యాలయంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బూడిద గోపి అధ్యక్షతన జరిగిన విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభలో జిల్లా కార్యదర్శి కనకారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రపంచ బ్యాంకు విధానాలను అమల్లో భాగంగా రాష్ట్ర విద్యుత్తును ప్రైవేటీకరణ చేయడం కోసం ప్రయత్నం చేయగా దానిని ఆపాలని, రైతులు, పేదలకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆరు నెలల పాటు పోరాటం చేసినట్టు గుర్తుచేశారు. ప్రజలు చేస్తున్న ఆందోళన పట్టించుకోకుండా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ముందుకెళ్లడానికి ప్రయత్నం చేయగా వామపక్ష పార్టీలు 2000 సంవత్సరం ఆగస్టు 28న చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. శాంతియుతంగా బషీర్‌బాగ్ చౌరస్తా వద్ద నిరసన చెబుతున్న వామపక్ష పార్టీల కార్యకర్తలు ప్రజలపై చంద్రబాబు ప్రభుత్వం పాసవికంగా కాల్పులు జరిపిందన్నారు. ఈ కాల్పుల్లో కామ్రేడ్ రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ అమరులయ్యారని పేర్కొన్నారు. ఈ పోరాట ఫలితంగా ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ ప్రైవేటీకరణను నిలిపివేసిందన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఉచిత కరెంటు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు భూక్య చందు నాయక్, కళ్యాణం లింగం, మంగ బీరయ్య, పల్లెల లలిత, కొండ వరలక్ష్మి, పంతం సాయికుమార్, గాజుల నాగరాజు, కర్రే రాములు, అజ్మీర సురేష్‌నాయక్, తుటి దేవదానం, కాకర్ల రమేష్, గట్టయ్య, చింతకింది లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కవిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం..



**హైదరాబాద్, మన చౌరాస్తా :** ఢిల్లీ లిక్కర్ కేసులో ఐదున్నర నెలల పాటు తీహార్ జైల్లో ఉన్న ఎమ్మెల్సీ కవిత మంగళవారం రాత్రి బెయిల్ పై విడుదలయ్యారు తప్ప, నిర్దోషిగా కాదని బీజేపీ నగర కార్యవర్గ సభ్యుడు డా. వై.రాజ్ కుమార్ అన్నారు. జైలు నుంచి విడుదలైన అనంతరం కవిత మాట్లాడుతూ వడ్డీతో సహా చెల్లిస్తా అన్న వ్యాఖ్యలపై తీవ్రంగా ఖండించారు. వడ్డీతో సహ చెల్లిస్తా అంటే వంద కోట్లకు వడ్డీతో సహా చెల్లిస్తారని ఎద్దేవా చేశారు. చట్టం ఎవరికి చుట్టం కాదని, చట్టం తన పని తాను చేసుకోపోతుందన్నారు.

# గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పూర్తి

### – కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నేడు జనగామ జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా... కలెక్టరేట్ లో జనగామ మండలంలోని ఓబుల్ కేశ్వపురంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. బుధవారం ఓబుల్‌కేశ్వాపురం గ్రామాన్ని కలెక్టర్‌తో అడిషనల్ కలెక్టర్ పింకేశ్ కుమార్ సందర్శించి గవర్నర్ పర్యటన కోసం వివిధ శాఖల ద్వారా చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. గవర్నర్ పర్యటన ప్రణాళిక బద్ధంగా కొనసాగేందుకు దేవాలయం, ఆడిటోరియంలోను అధికారులకు విధులు కేటాయించామన్నారు. కళాబృందాలు, వేద మంత్రాలతో వేంకటేశ్వరస్వామి దేవాలయంలోకి గవర్నర్‌కు స్వాగతం ఉంటుదన్నారు. దైవ దర్శనం చేసుకున్న అనంతరం ఆలయ ఆవరణలో గవర్నర్ మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సరిత, పంచాయతీ అధికారిణి స్వరూప, బీసీ సంక్షేమాధికారి, తహసీల్దార్ వెంకన్న, ఎంపీడీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



Local News




# సుస్థిర అభివృద్ధి సాధించాలి

- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లతో సమావేశం

**హనుమకొండ, మన చౌరాస్తా :** వరంగల్ చారిత్రక వారసత్వ నగరం అని, కాకతీయులు పాలించిన సామ్రాజ్యంగా ఈ నగరానికి ఘనమైన చరిత్ర ఉన్నదని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాలులో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. జాతీయ గీతాలాపన అనంతరం హనుమకొండ వరంగల్ జిల్లాల అధికారులతో సమావేశం ప్రారంభమైంది. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య జిల్లాలో చారిత్రక దేవాలయాలు, ప్రదేశాలు, పార్కులు, స్మార్ట్ సిటీ, జాతీయ రహదారులు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, విపత్తుల నిర్వహణ సమయంలో, ఇతరత్రా అంశాల కోసం వినియోగిస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ప్రతిపాదిక కూరగాయల మార్కెట్, విపత్తుల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ, బయో మైనింగ్ ప్లాంట్, కాళోజీ కళాక్షేత్రం, తదితర అంశాలతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, తదితర శాఖల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర గవర్నర్ కు జిల్లా కలెక్టర్ వివరించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లాకు సంబంధించి విద్య, వైద్య ఆరోగ్య, ఎంజీఎం ఆసుపత్రి, ఐసిడిఎస్, వ్యవసాయ, ఏనుమాముల వ్యవసాయ మార్కెట్, ఇతర శాఖల గురించిన వివరాలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర గవర్నర్ కు వివరించారు. వరంగల్ నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి, శాంతిభద్రతలు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర గవర్నర్ కు వివరించారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ చారిత్రక నగరమైన వరంగల్ లో అనేక చారిత్రక దేవాలయాలు ఉన్న ప్రాంతం ఇదని పేర్కొన్నారు. చారిత్రక వారసత్వ నగరమైన వరంగల్ మరింత సుస్థిరాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. వ్యవసాయ రంగంలోనూ జిల్లా ముందుండాలన్నారు. పీఎం కుసుమ్ యోజన పథకం ద్వారా సౌర విద్యుత్తు ను వినియోగించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వేగంగా అభివృద్ధి సాధిస్తుండడం పట్ల తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల తీరు తనను ఆకట్టుకుందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల అభివృద్ధి చెందడానికి ఎన్నో సంక్షేమ పథకాలు రాష్ట్రంలో ఉండడం చాలా సంతోషకరమన్నారు. వరంగల్ జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాలు అభివృద్ధి లో ముందంజలో ఉండడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా మరింత ఆర్థిక అభివృద్ధిని సాధించాలన్నారు. నగరంలోని ఆస్పత్రులు ఎంతో పరిశుభ్రంగా ఉన్నాయనే విషయం తెలిసి చాలా సంతోషం కలిగిందన్నారు. చారిత్రక వరంగల్ నగరంలో పర్యటించడం నాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు.ట సౌర విద్యుత్ విషయం ప్రస్తావన సమయంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత నిస్తూ, రైతులకు ఉచిత విద్యుత్తును రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. సమావేశం అనంతరం రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, మండలి వైస్ ఛైర్మన్ బండా ప్రకాష్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మెన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, ఎమ్మెల్సీలు బస్వరాజ్ సారయ్య, తీన్మార్ మల్లన్న, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్ నాగరాజు, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి , గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి, హనుమకొండ వరంగల్ జిల్లాల వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ములుగు ఆస్పత్రి పరిశీలన



**ములుగు, మన చౌరాస్తా :** ములుగు జిల్లాలో రెండు రోజుల పర్యటన అనంతరం తిరుగు ప్రయాణంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తో కలిసి జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు ఆస్పత్రిలో పేషంట్లకు అందిస్తున్న వైద్య సేవల గురించి అధికారులు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.వెంకటేశం, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, ఎస్పీ శబరీష్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ లాల్ పాల్గొన్నారు.



## 31న గద్దర్ వర్ధంతి సభ

**హనుమకొండ, మన చౌరాస్తా :** ప్రజా వాగ్గేయకారుడు గద్దరన్న మరణించి యేడాది పూర్తయిన సందర్భంగా వర్ధంతి సభ నిర్వహించనున్నట్టు గద్దర్ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడు కోండ్ర నర్సింగరావు, ఉపాధ్యక్షుడు సుంకరి భిక్షపతి తెలిపారు. ఆగష్టు 31 నాడు హనుమకొండలోని ప్రెస్ క్లబ్ లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ముఖ్య అతిథులుగా గుమ్మడి సూర్యకిరణ్, విమలక్క, ప్రొ.కూరపాటి వెంకటనారాయణ, సిఎల్ యాదగిరి, డా.పృథ్వీరాజ్ యాదవ్,, డా.జిలుకర శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ నాగరాజు, ప్రధాన కార్యదర్శి సదయ్య, సాయిని నరేందర్, సోమ రామ్మూర్తి , వనజక్క హాజరు కానున్నట్టు తెలిపారు.



## కౌన్సిలర్ భర్తకు పరామర్శ

**జనగామ, మన చౌరాస్తా :** జనగామలోని ఒకటో వార్డు కౌన్సలర్ రామగళ్ల అరుణ భర్త రామగాళ్ల విజయ్ ఓ ప్రమాదంలో చేయి విరిగింది. విషయం తెలుసుకున్న ఎన్ఎస్‌యూఐ జనగామ జిల్లా అధ్యక్షుడు చిలువేరు అభి గౌడ్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లోక్కుంట్ల ప్రవీణ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న బాల్నే నరేష్ తదితరులు విజయ్ ఇంటికి వెల్లి కలిసి పరామర్శించారు.



## స.హ చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మల్లం

**జనగామ, మన చౌరాస్తా :** సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శింగా మల్లం వెంకటేశం నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం జాతీయ నేత ఆదేశాలతో జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సురా స్రవంతి ఆయన నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సర్థవంతంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన జాతీయ, రాష్ట్ర నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాదగోని శ్రీనివాస్ గౌడ్, పందుల రాజు గౌడ్, బత్తుల మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

## ఇషా చావ్లా..
# రీ ఎంట్రీ..!

**మన చౌరాస్తా, సినిమా :** 2011లో తెలుగు రాష్ట్రాల్లోని థియేటర్లలో భారీ విజయాన్ని అందుకున్న సినిమా ప్రేమ కావాలి. ఎలాంటి అంచనాలు లేకుండా చిన్న సినిమాగా విడుదలైన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. డైరెక్టర్ విజయ్ భాస్కర్ దర్శకత్వంలో విలక్షణ నటుడు సాయి కుమార్ తనయుడు ఆది సాయి కుమార్ ఈ సినిమాతో హీరోగా పరిచయమయ్యాడు. ఫస్ట్ మూవీతో హిట్ అందుకున్న ఆది.. అటు నటనపరంగానూ ప్రశంసలు సొంతం చేసుకున్నాడు. ఇక అనూప్ రూబెన్స్ అందించిన మ్యూజిక్ గురించి చెప్పక్కర్లేదు. ఈ సినిమాలోని ప్రతీ సాంగ్ సూపర్ హిట్. ఇప్పటికే ఈ చిత్రంలోని పాటలు వినిపిస్తూనే ఉంటాయి. అలాగే ఈ సినిమాలో ఆది సాయి కుమార్ సరసన నటించింది ఇషా చావ్లా. ఈ మూవీతోనే కథానాయికగా తన కెరీర్ స్టార్ట్ చేసింది. మొదటి సినిమాతోనే అందం, అభినయంతో ప్రేక్షకులను కట్టిపడేసింది. ప్రేమ కావాలి సినిమా హిట్ కావడంతో ఇషా చావ్లాకు యూత్‌లో మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. అతి తక్కువ సమయంలోనే ఇండస్ట్రీలో క్లిక్ అయ్యింది. దీంతో ఆ తర్వాత తెలుగులో ఈ బ్యూటీకి వరుస ఆఫర్స్ వచ్చాయి. మొత్తం ఐదు తెలుగు సినిమాలు.. ఒక కన్నడ సినిమాలో అలరించింది. అయితే ప్రేమ కావాలి తర్వాత ఆ స్థాయిలో మరో హిట్ అందుకోలేకపోయింది. దీంతో ఈ బ్యూటీకి ఆఫర్స్ తగ్గిపోయాయి. నెమ్మదిగా ఇండస్ట్రీకి దూరమయ్యింది. చాలా కాలం పాటు సినిమాలకు బ్రేక్ తీసుకున్న ఈ అమ్మడు ఇప్పుడు మళ్లీ రీఎంట్రీ ఇస్తుంది. 2014 నుంచి తెలుగులో ఒక్క సినిమా కూడా చేయని ఇషా చావ్లా.. ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవి సినిమాతో కంబ్యాక్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. చిరు, డైరెక్టర్ వశిష్ట కాంబోలో రాబోతున్న విశ్వంభర చిత్రంలో ఇషా చావ్లా నటిస్తుంది. ఇందులో మీనాక్షి చౌదరి, ఆషికా రంగనాథ్, త్రిష, సురభి నటిస్తుండగా.. ఇషా స్పెషల్ రోల్ చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ జరుగుతుంది. పదేళ్ల గ్యాప్ తర్వాత తెలుగులోకి రీఎంట్రీ ఇస్తుంది. ఇషా చావ్లా..ఢిల్లీ బ్యూటీ. చదువు పూర్తైన వెంటనే యాక్టింగ్ కోర్స్ తీసుకుంది. ఆ తర్వాత సినిమాల్లో ఆఫర్స్ ప్రయత్నించింది.

